క్లుప్తంగా

నూతన విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: వెంకటాద్రిపేటలో కరెంట్ కోతలు అనే శీర్షిక మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎలక్ట్రికల్ అధికారులు యుద్ధప్రతిపాదికన సదరు ప్రాంతంలో విద్యుత్ అంతరాయానికి కారణమైన ఏ,బీ కేబుల్స్‌ను మార్చారు. వర్షాల కారణంగా 28వ తేదీ తెల్లవారుజామున 2.30గంటలకు ఏ, బీ కేబుల్ ఇన్సులేషన్ దెబ్బతిని కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగిందని ఎలక్ట్రికల్ ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు. బుధవారం దెబ్బతిన్న కేబుల్స్ స్థానంలో కొత్త కేబుల్స్ వేశారు. సదరు ప్రాంతంలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైతే 0863-2221760, 9440812292 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ విరమణ జీవితంలో ఓ భాగం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ విరమణ అనేది జీవితంలో ఒక భాగమేనని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ అధ్యయన కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎంవీ రమణారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, అధ్యాపకురాలు పి.నాగసుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఫాదర్ హయ్యర్ ఆశయసాధనకు కృషి

నెహ్రూనగర్: ఏఈఎల్‌సీ(ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి) ఏర్పాటుతో పాటు విద్యా, సామాజిక, సేవా రంగాల్లో ఫాదర్ హయ్యర్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ రెవరెండ్ ఇసుకపాటి శ్యాంకుమార్ పేర్కొన్నారు. ఏఈఎల్‌సీ 182వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంజనేయపేటలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఫాదర్ హయ్యర్ ఆశయాలకు అనుగుణంగా బుధవారం 200 మంది మహిళలకు చీరలు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు వేదాల డైజీబాబు, గుమ్మడి రత్నరాజు, వీర్రాజు, విజయ్, సతీష్, మేరి, శ్యామల, జయసుధ పాల్గొన్నారు.

పరీక్షా కిట్‌లు అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు హోప్‌విన్ హాస్పిటల్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మంగళగిరి మండలం నూతక్కిలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా విద్యార్థులకు ఉచితంగా గొడుగులు, పరీక్షా కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ నాగేశ్వరరావు, గుంటూరు కోవిడ్ ఫైటర్స్ ట్రస్టు చైర్మన్ పఠాన్ అల్లాబక్షు, పాఠశాల హెడ్‌మాస్టారు బి.రాజీవ్‌రత్న పాల్గొన్నారు.

యాప్ డెవలప్‌మెంట్ అంటూ మోసం

గుంటూరు ఈస్ట్: యాప్ డెవలప్ చేసి ఇస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఓ వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఎం.గౌతమ్‌సూర్య కృష్ణనగర్ 2వలైనులో ఎస్.రోహిత్‌కుమార్‌ను యాప్ డెవలప్ చేయాలని సంప్రదించాడు. రోహిత్ కుమార్ అందుకు రూ.16 లక్షలు తీసుకున్నాడు. అయితే అనంతర కాలంలో యాప్ డెవలప్ చేసి ఇవ్వలేదు. గౌతమ్ సూర్య దీనిపై ప్రశ్నించగా రోహిత్‌కుమార్ తిరిగి రూ.4 లక్షలు ఇచ్చాడు. రూ.12 లక్షలు ఇవ్వలేదు. బాధితుడు గౌతమ్ సూర్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దాడి ఘటనపై కేసు

గుంటూరు ఈస్ట్: కుటుంబ కలహాలతో ఇద్దరిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనివాసరావుపేటలో నివాసం ఉండే టి.దుర్గా భవానీ ఇంటికి ఆమె మామ వెంకటేశ్వర్లు వచ్చాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొంత మంది బంధువులు దుర్గాభవానీ ఇంటికి వచ్చి వెంకటేశ్వర్లు భార్యపై దాడి చేయబోగా, అడ్డు వచ్చిన కళ్యాణ్‌ను తిరుపతయ్య అనే వ్యక్తి కర్రతో కొట్టాడు. దుర్గాభవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంటి మరమ్మతులు చేసినందుకు కూలి డబ్బులు ఇవ్వలేదని ఇద్దరు ఇంటి ముందు భాగాన్ని ధ్వంసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీ అగ్రహారానికి చెందిన దాసరి వరప్రసాదరావు తన ఇంటిని మరమ్మతులు చేయించాడు. అందుకు మరమ్మతులకు చేసి బాజి, శివలకు రూ.6 వేలు బాకి ఉన్నాడు. బాకీ డబ్బులు చెల్లించలేదు. దీంతో బాజి, శివ ఇంటి వరండాలోని టైల్స్‌ను ధ్వంసం చేశారు. వరప్రసాదరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి నగరంపాలెం జెమిని టీస్టాల్ సమీపంలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊపిరి తీసే రాచపుండు

- పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు
- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలి
- పొగతాగని వారికి సైతం సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- నేడు వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే



గుంటూరు మెడికల్: మనిషి ఊపిరి తీసుకునేందుకు తద్వారా అతడు జీవించి ఉండేందుకు ఉపయోగపడే ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు అధికమవుతుండడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఆధునిక జీవనశైలి వల్ల వాహనాల వినియోగం పెరిగిపోవడం, పచ్చదనం తగ్గిపోవడం, పారిశ్రామికీకరణ పెరిగిపోవడంతో ఊపిరితిత్తుల క్యాన్సర్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఊపిరి తిత్తుల క్యాన్సర్‌ను వైద్య నిపుణులు సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటున్నారు. ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకడం ద్వారా త్వరితగతిన మరణాలు సంభవిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం క్యాన్సర్ మరణాల్లో మూడొంతులు ఊపిరితిత్తులకు సంబంధించి మరణాలేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలు వ్యాధి బారిన పడకుండా ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 1న వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాధి కారణాలు...

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. సిగిరెట్లు, హుక్కా, గంజాయి పీల్చటం లంగ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఊపిరి తిత్తుల క్యాన్సర్ సోకిన వారిలో నూటికి 90శాతం మంది పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డారు. సాధారణ వ్యక్తితో పోల్చితే పొగతాగేవారిలో క్యాన్సర్ రావటానికి 2.5శాతం రెట్లు ఎక్కువ అవకాశం ఉంది. కాలుష్య పొగల కారణంగా, వాహనాల కాలుష్యం వల్ల, రేడియేషన్ వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

జిల్లాలో బాధితులు...

జిల్లాలో 30 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.

వీరికి ఎక్కువగా ఊపిరితిత్తుల క్యాన్సర్...

పొగతాగేవారి కంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. మహిళలు, పిల్లలూ బాధితులే. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనే వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నట్లు వైద్య నివేదికలు తెలియజేస్తున్నాయి. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సరే కాకుండా శరీరంలోని ఇతర అవయవాలకు సైతం క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం చేసేవారితోపాటు వారి పక్కన ఉండే కుటుంబ సభ్యులు ఎక్కువశాతం క్యాన్సర్‌బారిన పడుతున్నారు. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65శాతం మంది మహిళలు, 35 శాతం మంది పురుషులు ఉన్నారు.

ఆధునిక వైద్యం అందుబాటులో....



క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. గతంలో క్యాన్సర్లు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్నవారిలో వచ్చేవి. నేడు 30 ఏళ్లకే క్యాన్సర్లు రావడం చాలా బాధాకరం.

– డాక్టర్ ఎస్.జి.నాగకిషోర్, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

ఈ జాగ్రత్తలు పాటించండి....

ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు...

విడవకుండా దగ్గు రావటం, దగ్గులో రక్తం పడటం, ఆకలి లేకపోవటం, ఛాతీలో నొప్పి, గొంతు బొంగురు పోవటం, ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే బరువు తగ్గిపోవటం, ఎముకలు, కీళ్ల, వెన్ను, నడుంనొప్పి ఎక్కువ కాలం ఉండటం, శ్వాస సరిగా ఆడకపోవటం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడటం, నిద్రలో గురకరావటం, తరచుగా జబ్బు బారిన పడటం లాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అలస్యం చేయకుండా ఊపిరితిత్తుల క్యాన్సర్‌గా భావించి వైద్యులను సంప్రదించాలి.

సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి....



పలువురు వ్యాధి నిర్ధారణ సకాలంలో చేయించుకోవడం లేదు. దీంతో వ్యాధి నిర్ధారణ చేసే సమయానికి క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు గుర్తిస్తున్నాం. దీని వల్ల వైద్యం చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చక్కా సుజాత, రేడియాలజిస్ట్, గుంటూరు

అంతరాలు పెంచేలా కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న డాక్టర్ జి.సుధాకర్

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్ చాలా నిరాశజనకంగా ఉందని, ఆర్థిక లోటు తగ్గించేందుకు, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఎలాంటి ప్రయత్నాలు లేవని, మొత్తంగా దేశంలో అంతరాలను మరింత పెంచేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఆర్థికవేత్త, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుధాకర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విశ్లేషకుల చర్చ వేదికలో ఆయన మాట్లాడుతూ సామాన్యులకు మాటల్లో.. కార్పొరేట్లకు కోట్లలో వడ్డించే కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లోనూ అదే విన్యాసం చేసిందన్నారు. ఆర్థికవేత డాక్టర్ ఎ.రాజశేఖర్, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి ఏడవ సారి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఉత్త మాటలే దక్కాయన్నారు.

వెంటనే కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలి..

గుంటూరు నగర సమస్యలపై చర్చించేందుకు ఉపయోగపడే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గత ఐదు నెలలుగా జరగడం లేదని దీంతో ప్రజలెన్నుకున్న కార్పొరేటర్లు, కౌన్సిల్ వల్ల ఏమీ ఉపయోగం లేకుండా పోయిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ విభేదాలకు మున్సిపల్ కౌన్సిల్ వేదిక కారాదని పిలుపు నిచ్చారు. గత నాలుగు నెలలుగా సమావేశాలు జరగక పోవడంతో కొత్త పనులు ఏమీ మంజూరు కాకుండా పోయాయని అన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణమైన పోషకాహారమని, బిడ్డ పుట్టిన గంటలోపలే తల్లిపాలు పట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయం సెమినార్ హాలులో ఆస్టర్ రమేష్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాన్పు సమయంలో ఉత్పత్తి అయ్యే కొలెస్ట్రమ్ వలన వ్యాధినిరోధక శక్తి వస్తుందన్నారు. తల్లిపాల వల్ల బిడ్డకు తేలికగా జీర్ణం అవడం, వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్ట్ ఎస్.అనిత, డాక్టర్ సాహితీ, డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మమత పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



హెచ్ఎం రమేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నాడు-నేడు ద్వారా నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలల అభివృద్ధికి మంజూరు చేసిన రూ.1.20 కోట్లతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. ఇప్పటివరకు మంజూరైన రూ.60 లక్షల మేరకు పనులు పూర్తయినట్లు పాఠశాల హెచ్ఎం రమేష్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తరగతి గదుల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట టీడీపీ 53వ డివిజన్ అధ్యక్షుడు గుడిమెట్ల దయారత్నం, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో మెరుగైన ర్యాంక్ సాధించడమే లక్ష్యం

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్- 2024లో గుంటూరు నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంక్ సాధించడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్‌రావు తెలిపారు. నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్.హరికృష్ణ ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్- 2024లో తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య అధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని సాధించడానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందుకు తగిన విధంగా వార్డు సచివాలయాల వారీగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గత ఏడాది కంటే మెరుగైన ర్యాంక్ సాధించడం తేలికవుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, ప్రతి కమర్షియల్ సంస్థ డస్ట్ బిన్‌ని ఏర్పాటు చేసుకునేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా చర్యలు చేపట్టడం, ఖాళీ స్థల యజమానులే తమ స్థలాలను శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో శానిటరీ సూపర్వైజర్లు రాంబాబు, ఆనంద కుమార్, అయూబ్ ఖాన్, సోమ శేఖర్, సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు ద్రోణాచార్య అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు, అహల్య ఐవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు ప్రతిష్టాత్మకమైన ద్రోణాచార్య అవార్డు లభించింది. బెంగళూరులో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు ఇండియన్ సొసైటీ ఫర్ అసిస్టెడ్ రీ ప్రొడక్షన్(ఐసార్) జాతీయ సదస్సు జరిగింది. సంతానలేమి సమస్యలున్నవారికి ఆధునిక చికిత్సా పద్ధతుల్లో సంతానం పొందేలా చేయటం, ఎంబ్రియాలజీ, ఆండ్రాలజీ, పిండం బదిలీ, అండం పికప్, స్పెర్మ్ తయారీ, ఏఆర్‌టీ ల్యాబ్ ప్రొసీజర్స్‌లో డాక్టర్ ఉమాశంకర్ చేస్తున్న సేవలకు గాను అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజకుమారి, గైనకాలజీ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ బి.వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. తొలుత జరిగిన క్విజ్ పోటీల్లో ఏపీ తరఫున క్విజ్ పోటీల్లో పాల్గొన్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ సుమా వర్ష, డాక్టర్ దేదీప్య జట్టు ప్రథమస్థానం గెలుచుకుంది. డాక్టర్ పద్మలత, డాక్టర్ పద్మజ, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ ప్రమోద ఆధ్వర్యంలో 2025లో ఏపీలో ఐసార్ సదస్సును మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయించారు. సదస్సులో ఐసార్ ప్రెసిడెంట్ డాక్టర్ అమిత్ పార్థి, ఫాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ నందిత, సెక్రటరీ డాక్టర్ ఆశాబక్ష్మి, ఇమ్రియాలజీ చైర్ చారిదత్‌జోషి, కేఐఎస్ఏఆర్ ప్రెసిడెంట్ డాక్టర్ నివేదిత పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆర్మీ ఉద్యోగి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో ఆర్మీ ఉద్యోగి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల సమీపంలోని ఈపూరుపాలెం మండలం తోటవారిపాలెంకు చెందిన డేగల వెంకటసుబ్బారావు (35) ఆర్మీలో పనిచేస్తున్నాడు. గత నెల 30వ తేదీ సాయంత్రం నాజ్ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ లాడ్జిలో రూమ్ అద్దెకు తీసుకుని ఉన్నాడు. బుధవారం రూమ్‌లో నుంచి బయటకు రాకపోవటంతో గమనించిన లాడ్జి సిబ్బంది, వెంకట సుబ్బారావు మృతి చెందినట్లు గుర్తించారు. కొత్తపేట పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి




పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

లక్ష్మీపురం: ప్రభుత్వాలు మారుతున్న కార్మికులు, రైతుల సమస్యలు తీరడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రజలపై భారాలు మోపుతూ బడా కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రకటించిందని విమర్శించారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని దుయ్యబట్టారు. గుజరాత్ వ్యాపారస్తుల ప్రభుత్వమన్నారు. కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో విశాఖపట్నంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని 3వ తేదీ వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన, బహిరంగ సభ జరగబోతున్నదని గుంటూరు జిల్లా కార్మిక వర్గం ఈ ర్యాలీ, బహిరంగ సభలలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహా ప్రదర్శన పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6న చుండూరు అమరవీరుల వర్ధంతి

నెహ్రూనగర్: చుండూరు అమరవీరుల వర్ధంతి సభ ఆగస్టు 6వ తేదీన బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో నిర్వహించనున్నట్లు దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరపత్రాలను అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శిఖా సురేష్, సాధు మాల్యాద్రి, వేల్పూరి నరసింహారావు, పాగళ్ల ప్రకాష్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి



జేసీ భార్గవ్ తేజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

గుంటూరు వెస్ట్: జిల్లాలోని రేషన్ డీలర్ల కనీస సమస్యలను పరిష్కరించాలని చౌకదుకాణాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాదరావు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జేసీని అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఐసీడీఎస్, ఎండీఎం బకాయిలు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు నెలల నుంచి బియ్యంపై రావాల్సిన కమీషన్లు ఎస్‌సీఎం ఖాతాలో జమచేస్తున్నారని, దీనివల్ల డీలర్లు ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కమిషన్‌ను డీలర్ల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు దాసరి శ్రీనివాసరావు, వంగపాటి అంజయ్య, కె.విద్యాసాగర్, పి.సాయి హనుమంతరావు, కిషోర్ పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం



గుంటూరు రూరల్: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం (ఏక్ పేడ్ మా కే నామ్ సే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారి వారి తల్లి పేర్లపై ఒక్కొక్క మొక్కను నాటారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ చెట్లు మనకు స్వచ్ఛమైన గాలి నీరు, ఆహారాన్ని అందిస్తాయన్నారు. మనం చెట్టును కాపాడితే ఆ చెట్టు మనలను కాపాడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ తల్లి పేరుపై చెట్టు నాటాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహద పడతాయని, వాయు కాలుష్యాన్ని నియంత్రించి ఓజోన్ పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తాయన్నారు. కళాశాల ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ ఎం.సతీష్‌కుమార్, పీడీ పి.పున్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఎస్పీ సత్కారం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. ఎస్‌బీ డీఎస్పీ టి.రత్నస్వామి, ఏఎస్ఐలు వెంకటేశ్వర్లు (ఎస్‌బీ), టి.పెదబాబు (కంట్రోల్ రూమ్), షేక్ ఎండీ జానీ (మేడికొండూరు పీఎస్), కె.మోహనరావు (ఫిరంగిపురం పీఎస్), హెడ్ కానిస్టేబుల్ దేవరాజు (అరండల్‌పేట పీఎస్), హెచ్‌సీ రత్నరాజు (ఏఆర్), కానిస్టేబుల్ కమల్ బాషా (తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్)లు బుధవారం ఉద్యోగ విరమణ పొందగా, జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రమ శిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారని, అందరూ ఒకే పోలీస్ కుటుంబమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఆర్ఐ హరిరెడ్డి, గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్ , మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

డాక్టర్ షమా సుల్తానాకు అకడమిక్ అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ షమా సుల్తానాకు అకడమిక్ అవార్డు లభించింది. చెన్నైలో ఫాగ్సి సెక్సువల్ హెల్త్ అండ్ ఎస్టీఐ కమిటీ, ఆగ్సి ఈ ప్రొడక్టివ్ హెల్త్ కమిటీ ఆధ్వర్యంలో వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా సీఎంఈ జరిగింది. సీఎంఈలో డాక్టర్ షమా సుల్తానా ఇచ్చిన లెక్చర్‌కు కమిటీ నిర్వాహకులు అవార్డు అందజేశారు. డాక్టర్ షమా సుల్తానా హోప్‌విన్ హాస్పటల్ ఆధ్వర్యంలో కేవలం రూ.10లకే ఓపీ ఫీజుతో స్పెషాలిటీ, కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందిస్తున్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే నసీర్ పూజలు

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బుధవారం శాకంబరీ దేవిగా అలకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, దేవస్థానం ఈఓ పాదర్తి దుర్గారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను శాలువా, గజమాలతో సత్కరించారు.

అక్టోబరులో అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు

నగరంపాలెం: గుంటూరు నాజ్‌కూడలి ఐలాండ్‌లో పద్మశ్రీ అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పా టు చేయనున్నట్లు అల్లురామలింగయ్య నాటక కళాపరిషత్, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెండెం వెంకటశివప్రసాద్ తెలిపారు. మార్కెట్ కూడలిలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహావిష్కరణకు ప్రముఖ సినీ నటుడు హాజరవుతారని అన్నారు. అక్టోబర్ 25, 26, 27 తేదీల్లో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8074148228 నంబర్‌లో సంప్రదించాలని ఆయన చెప్పారు. బుధవారం అల్లు రామలింగయ్య 21వ వర్ధంతి సందర్భంగా బ్రాడీపేటలోని దీనజనసేవా సమితిలో పండ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, కార్యదర్శి దళవాయి సుబ్రహ్మణ్యం, రమేష్, టి.శ్రీనివాసరావు, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు గురైన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గతం 11 నెలల కాలం నుంచి సస్పెన్షన్‌కు గురైన 12 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం విధుల్లోకి చేరిన నగర కమిషనర్ హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రెహమాన్, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, లక్ష్మీ నారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుమిత్రా దేవి, సహాధ్యక్షురాలు లీలాబాయి, రోజారాణి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రిచా కెరోలినాకు ఏఎన్‌యూ పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి గుంటూరు నగరానికి చెందిన కట్టుపల్లి రిచా కెరోలినా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'స్టాటజిక్ ప్రమోషన్ ఆఫ్ స్టార్టప్ ఎంటర్‌ప్రైజెస్ - ఏ మార్కెటింగ్ పర్‌స్పెక్టివ్' అనే అంశంపై డాక్టర్ బి.రాధ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. కాగా గుంటూరులోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తనయురాలైన రిచా కెరోలినా ఇటీవల వివాహానంతరం ఆస్ట్రేలి యా వెళ్లారు. ఏఎన్‌యూనుంచి పీహెచ్‌డీ పట్టా అందుకునేందుకు ఆమె తిరిగి స్వదేశానికి వచ్చారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: భార్యాభర్తల వివాదం నేపథ్యంలో భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. బుచ్చతోట 6వలైనుకు చెందిన షేక్ హలిమా(30) భర్త బాజీసైదాలు భార్యాభర్తలు. వీరికి ఇరువురు సంతానం. మద్యానికి బానిసైన బాజీ నిత్యం భార్యను వేధిస్తుండేవాడు. భర్త వేధింపులు భరించలేక నజీమా మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఖాదర్‌బి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.